

# డియర్ కామ్రేడ్

డా॥ వి. చంద్రశేఖరరావు

అరుణ దగ్గర నుంచి మరో ఉత్తరం వచ్చింది.

చదవకుండా చించి బుట్టలో వెయ్యాలనే కోరిక కలిగింది. చెయ్యలేకపోయాను. అలాగే ప్యాంటు జేబులో దోపుకొని, ఏమీ జరగనట్టే ఉండాలని ప్రయత్నించాను.

ఉహూ, సాధ్యం కాలేదు. పిడికిలంత ఆ గుండెలో తుపానులు, ఉప్పెనలు టార్పిడోలు.

అరుణ ఉత్తరాలు చాలా టూకీగా ఉంటాయి. పదో, ఇరవయ్యో పదాలు ఉంటాయి. ఆ పదో, ఇరవయ్యో పదాలు నిప్పులు కూరి నాపై విసిరేసిన ఆయుధాల్లా ఉంటాయి. 'మైడియర్ మాజీ కామ్రేడ్!' అని మొదలుపెడుతుంది. ఒక్కోసారి 'యుద్ధభూమి నుండి పారిపోయి వచ్చిన అభినవ తిక్కనా!' అనీ, ఇంకొకసారి 'డియర్ రెనగేడ్!' అనీ వుంటుంది సంబోధన. ఉత్తరాల్లో పెద్ద విశేషాలు ఉండవు. 'ఫలాని అడ్రసుకు వెయ్యి రూపాయల డ్రాఫ్టు పంపించు,' అనో! 'ఫలానా వ్యక్తికి ఈ సాయం చెయ్యి, ఆ సాయం చెయ్యి,' అనో ఆజ్ఞలు ఉంటాయి.

ఒక్కోసారి, 'ఉద్యమంలో ఉన్నవాడికి ఒకటే మరణం. పారిపోయి వచ్చిన వాడికి లక్ష మరణాలు,' అంటూ కొటేషన్ విసురుతుంది.

అరుణ ఉత్తరాలు చూడగానే తెగిపోయిన అంగాల దగ్గర కలిగే బాధాకరమైన సెన్సేషన్ కలుగుతుంది. మనస్సు చివుక్కుమంటుంది. ఒకే తప్పుకు పదేపదే శిక్షను అనుభవిస్తున్న ముద్దాయిలా ఉంటుంది నా పరిస్థితి. ఉత్తరం వచ్చిన రెండు మూడురోజుల పాటు విరక్తిలాంటి భావన. దిగులు, వెలితి, గిల్టీనెస్ ఎట్సెట్రా.

చుట్టూ మరో ప్రపంచపు అలజడి. నేను పనిచేసే కార్పొరేటు ప్రపంచపు కార్యాలయం సందడి. కంప్యూటర్లు, మనుషులు జమిలిగా సాగించే డబ్బు వేట తాలూకు హడావుడి, కోలాహలం. ఇంకో పది నిమిషాల్లో రివ్యూ మీటింగ్ జరుగుతుంది. నెలకోసారి జీతానికి అమ్ముడయిన మానవ యంత్రాల నుంచి ఎంత పనిని పిండుకున్నా ఏదో తెలియజేసే రివ్యూ. ప్యాంటు జేబులో ఇంకా పేలని బాంబులాంటి ఉత్తరాన్ని దాచుకొని మీటింగ్‌కి బయల్దేరాను.

"వాట్ హాపెండ్ టు యు రాజశేఖరం! సడన్‌గా అలా గ్లూమీగా అయిపోయావు. ఆర్ యూ ఆల్‌రైట్!" ఎం.డి. కామెంట్‌తో అందరి కళ్లూ నావైపు తిరిగాయి.

ఎర్రజీరల కళ్లు, వాడిపోయిన ముఖం, నలిగిన ప్యాంటూ, షర్టూ- రాజ్‌కపూర్ గెటప్‌లో వున్న నావైపు క్షణకాలం పాటు ప్రశ్నార్థకంగా, ఎంటర్‌టైనింగ్‌గా చూశారు స్టాఫ్. కార్పొరేటు ప్రపంచంలో ప్రతిక్షణం ఫ్రెష్‌గా అప్పుడే తోట నుండి దిగుమతి అయిన గులాబీల్లా ఉండాలి. ముఖంలో అలసట, విసుగు విషాదం కనబడకూడదు. పెదవులకు చిరునవ్వు తగిలించి, 'ఎప్పటికీ మీ సేవలో ఉండే,' మార్కు గెటప్‌లో ప్రత్యక్షమవాలి. "ఏమీలేదు సార్! కొంచెం తలనొప్పిగా ఉంది!" చిలుక పలుకులు పలికాను. మనసును నాలుకను డీలింక్ చేయటం కార్పొరేటు ప్రపంచంలో ముఖ్యమైన ఆవశ్యకత.

"నేను ఎప్పుడూ చెబుతుంటాను. కష్టపడి పని చేసేవాడికి L&P సంస్థ బంగారు బాతు అని. దానికి మంచి ఉదాహరణ మిస్టర్ రాజశేఖరం. సేల్సు మేనే

జరుగా మొదలుపెట్టి ఈరోజు ఇ.డి. అయ్యాడు. ఏదో ఒకరోజు ఈ సంస్థకు ఎం.డి. అయినా ఆశ్చర్యం లేదు. అతనిలో ఒక శ్రమజీవి ఉన్నాడు. ఒక మేధావి ఉన్నాడు. తనను తాను యంత్రంలా మార్చుకోగల ఎడాప్టర్ ఉన్నాడు...'' ఎం.డి. సుత్తి కొడుతున్నాడు. రెండుమూడు ముఖ్యమైన కాంట్రాక్టులు సంపాదించి కంపెనీ ఆదాయాన్ని పెంచినందుకు ఈ అభినందనలు. మరోసారి అయితే ఎం.డి. మాటలు రుచికరమైన భోజ్యాల్లా ఉండేవి. కానీ ఇప్పుడు కాదు. ఇప్పుడు అరుణార్ణవంలో ఉన్నాను. ఉత్తరం చదవకూడదనే నిర్ణయం. ఉత్తరంలో ఏముందో చూడాలనే చిత్రమైన కోరిక. టెన్షన్ ఆపుకోలేక ఉత్తరం చింపాను.

*రాజు డియర్! మరింక నా ఉత్తరాలు నిన్ను ఇబ్బంది పెట్టకపోవచ్చు. ఇదే నా చివరి ఉత్తరం కావచ్చు. ఏ క్షణంలోనైనా పోలీసులు నన్ను అరెస్టు చెయ్యవచ్చు. సెలవు సెలవింక నేస్తం! 'అరుణ'.*

గుండె క్షణకాలం పాటు పట్టుతప్పింది. కళ్లల్లో నీళ్లు ఉబికాయి. మీటింగ్‌లోంచి బయటపడి టాయ్‌లెట్‌కు వెళ్లాను. వరదలా తోసుకువచ్చే కన్నీటిని ఆపే ప్రయత్నం చెయ్యలేదు. బాణం గుచ్చుకున్న పక్షిలాగా గిలగిలలాడేను. నన్ను వెక్కిరించి చిత్రహింసలు చేసే కామ్రేడ్ అరుణ ఉత్తరం కాదు ఇది. పదేళ్లపాటు ప్రాణంలో ప్రాణంగా మసలిన ప్రియనేస్తం అరుణ ఉత్తరం ఇది. చాలాసేపు ఏడ్చినాక కొంచెం సేదతీరినట్టు అనిపించింది. ముఖం కడుక్కొని మళ్లీ మీటింగ్‌లోకి నా భౌతికకాయాన్ని లాక్కువచ్చాను. ఉత్తరానికి అడ్రస్ లేదు. సహాయాన్ని అర్థించే S.O.S. మెసేజ్ కాదది. ఒక లేఖావిశేషం మాత్రమే. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అదో పనిష్‌మెంట్ ఆర్డర్. ఆమె ఆపద గురించి తెలియజేస్తూ ఆ ఆపద నుంచి రక్షించడానికి ఏ అవకాశం ఇవ్వకుండా జాగ్రత్త పడింది. శరీరంపై పొడిపించుకున్న పచ్చబొట్టులా ఈ అపరాధ భావం నన్ను జీవితాంతం వెంటాడుతూనే ఉంటుంది.

''అతన్ని చూసి నేను గర్విస్తున్నాను. అతని ప్రతిభకు, సంస్థకు అతను అందించిన అమూల్యమైన సేవకు కాంప్లిమెంటుగా కంపెనీ తరఫున ఈ మారుతీ కారు ప్రజెంటు చేస్తున్నాను.'' స్టాఫ్ అంతా చప్పట్లు కొడుతుండగా ఎం.డి. కొత్త మారుతీ కారు తాళాలు నా చేతికి అందించాడు. కాంట్రాక్టులు సాధించటమనేది ఇక్కడ ప్రతిభకు కొలమానం. నిజాయితీగా కాంట్రాక్టులు అవార్డు చేసే కాలం వెళ్లిపోయింది. పోలీసు కుక్కల్లాగ ఎవడికేం బలహీనలుతున్నాయో కూపీల్లాగి ఆ మేరకు వాణ్ని తృప్తిపరచి కాంట్రాక్టులు సాధించటం, ఇవాల్టి ట్రెండు. రాజశేఖరం, ది డ్రీమ్ బాయ్ ఆఫ్ కార్పొరేటు వరల్డ్, ఇలాంటి ట్రిక్స్‌లో దిట్ట. ఆ మేరకు అంతరాత్మ ముందు మరుగుజ్జు. ఖుషీ అయిన ఫ్యూడల్ దొర మెడలోని హారాన్నో ఉంగరాన్నో మనపై విసిరినట్టు కంపెనీ మనకో మారుతీకారో, పోష్ ఏరియాలో ఫ్లాటో గిఫ్టుగా ఇస్తుంది. 'నమ్మకమైన సేవకుడ'నే లేబుల్ నుదిటి మీద అంటిస్తుంది.

రూమ్‌లోకి లిక్కర్స్ ఉన్న ట్రాలీ వచ్చింది. చరచరా చేతుల్లోకి పొకాయి గ్లాసులు. ఛీర్సు. గ్లాసుల చప్పుళ్లు. వాతావరణం వెచ్చనయింది. మంచుగుట్ట లాంటి మౌనం కరిగి కబుర్ల సర్పాల బుసబుసలు వినిపిస్తున్నాయి. ఆ చప్పుళ్లు తాకట్టు పెట్టబడిన ఆత్మల ఘోషలా వినిపిస్తున్నాయి నాకు. శబ్ద సముద్రంలో మునిగిపోయిన ఫీలింగ్. ఈ శబ్దాలన్నింటినీ మింగివేస్తూ సెలవు సెలవింక నేస్తం అంటూ అరుణ మాటలు గుండెల్లో మారుమ్రోగుతున్నాయి. తలలో సమ్మెటలు మ్రోగుతున్న బాధ. గుండెల్లో అలజడి. దు:ఖపు తెర త్రోసుకుని బయటకు వస్తానంటోంది. కార్పొరేటు ప్రపంచపు మర్యాద బలవంతంగా ఆ దు:ఖాన్ని తొక్కిపెడుతుంది. గుడ్‌బై, సీయూ, బైబైలతో మీటింగ్ ప్రహసనం ముగిసింది. చెరసాల నుంచి బయటపడ్డ అనుభూతి. కొత్త మారుతీకారులో కిక్కిరిసిన రోడ్ల మధ్య ఇంటి వైపు ప్రయాణం. ఒక జైలు నుంచి మరో జైలుకు రవాణా. చీకటి ముసిరిన సాయంకాలపు వేళ వాకిట్లో దీపశిఖలా ప్రత్యక్షమయింది లలిత. నా భద్ర జీవనంలో నన్ను ప్రతిక్షణం ఉత్తేజితుణ్ని చేసే నా జీవన టానిక్ లలిత. కాఫీ, కాసిన్ని స్వీట్ నథింగ్స్, చిన్న కౌగిలి, చిరుముద్దు ఎట్సెట్రా కాక్‌టైల్‌తో నన్ను రిజువనేట్ చేస్తుంది రోజూ. ఈరోజు లలిత మార్కు జీవన్ టానిక్ ఒంటికి రుచించలేదు. సారీ అంటూ బెడ్‌రూమ్‌లోకి జారుకున్నాను. ''డాడీ! నా ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చారు. క్లాస్ ఫస్ట్ నేనే!'' తుపానులా దూసుకొచ్చాడు ఎనిమిదేళ్ల బంటి. ముద్దు ముద్దు మాటలు. వయసుకు మించిన తెలివితేటలు. వాణ్ణి చూస్తే ఎంతో గర్వంగా ఉంటుంది. నా భద్రజీవనంలో విలువైన ఎసెట్ వాడే. ''కంగ్రాచ్యులేషన్స్!'' జీవంలేని ఒక ప్రశంస వాడి ముఖాన విసిరి, మళ్లీ ఒంటరితనంలోకి ముడుచుకుపోయాను. ''మూడీ డాడీ!'' అంటూ ఓ నిరసన విసిరి వెళ్లిపోయాడు.

లైటు వెయ్యని గదిలో నిశ్శబ్దంగా తగలబడుతున్న అరణ్యంలా మిగిలిపోయాను. మృదువైన అడుగుల చప్పుడు. రెండు మెత్తని చేతులు నా భుజం పైన తారట్లాడి మెల్లమెల్లగా పెనవేసుకొని, తన గుండెల వైపుకు లాక్కొని... విస్ఫోటన కారకమైన సౌందర్యం లలితది. ఆమె చేతిలో వేయి షాంపేన్ పెగ్గుల మత్తు ఉంది. "ఏమిటి, మళ్ళీ అరుణ దగ్గర నుంచి ఉత్తరం వచ్చిందా?" అడిగింది సానుభూతిగా. జేబులోంచి ఉత్తరం తీసి ఇచ్చాను. చాలాసేపు మౌనం మా మధ్య. మధ్య మధ్యలో నిస్సహాయతను సూచించే బరువైన నిట్టూర్పులు. "మా పెదనాన్నగారి అబ్బాయి రఘునాథ రావు ఉన్నాడు కదా! ఐ.పి.ఎస్. ఫెలో. నిజామాబాద్‌లో ఎస్.పి.గా చేస్తున్నాడు. అతన్ని కాంటాక్ట్ చేద్దాం! ఏదైనా హెల్ప్ చేస్తాడేమో!" సలహా ఇచ్చింది.

"వివరాలు లేకుండా ఏమని రిక్వెస్టు చేద్దాం! ఎక్కడుందో తెలియదు. ఏ పేరుతో జీవిస్తోందో తెలియదు," సందేహం వ్యక్తం చేశాను. మళ్ళీ నిశ్శబ్దం. మళ్ళీ కాసేపు మౌనం. "వర్రీ అయి మనం చేయలిగేది ఏముంది? తను ఎంచుకున్న బాటలో చిట్టచివరి మజిలీ ఇదే అని తనకు తెలుసు. అన్నిటికి సిద్ధమయ్యే ఈ అగ్నిపథంలోకి అడుగుపెట్టింది. మనం కళ్లనీళ్లు పెట్టుకొని, గుండెలు బాదుకొని, హుహు అంటూ నిట్టూర్చి చేసేదేముంది? దిగులు వెయ్యటం సహజమే. కంట్రోలు చేసుకోవాలి. రాత్రికో కాంపోజ్ మాత్ర వేసుకొని పడుకో. ఉదయానికి కాస్త రిలీఫ్ వస్తుంది." అప్పటికే కాంపోజ్ బిళ్ల, నిండైన పాలగ్లాసు బల్లమీద ఉన్నాయి. లలిత గొప్ప మేధావి. దాంపత్యపు మొక్కకు దిగులు, వ్యథలాంటి చీడలు అంటకుండా చాలా జాగ్రత్త పడుతుంది. నాలాంటి మధ్యతరగతి జీవులకు లలిత లాంటి భద్రదీపాలే నిజమైన రక్షణ.

కాంపోజ్ మాత్ర పెద్దగా ప్రభావాన్ని చూపలేదు. నిద్రరాని రాత్రి. అరుణ జ్ఞాపకాలు రగులుతున్న నెగళ్లలా ఒక్కో జ్ఞాపకం నన్ను నిలువెల్లా తగలబెడ్తుంది. అరుణకు ఉద్యమపు తొలి పాఠాలు నేర్పింది నేనే. దాస్ కేపిటల్‌ను ప్రతిపదార్థ వివరణలతో బోధించింది నేనే. దేశ దేశాల్లోని పోరాటపు గాథలు చెప్పి ఉత్తేజితురాల్ని చేసింది నేనే. అప్పట్లో ఆంధ్రప్రదేశ్‌లో బెంగాల్‌లో రహస్యంగా మండుతున్న పేద రైతుల పోరాటం స్ఫూర్తితో ఉద్యమం మొదలైంది. కాలేజీలను, యూనివర్సిటీలను వదలి ప్రవాహంలోకి దూకాము యువ కులం ఎందరిమో. అరుణలాంటి మిత్రులెందర్నో చేయి పట్టి ఉద్యమంలోకి లాక్కువచ్చింది నేనే. బలమైన రిప్రషన్ ధాటికి నలుదిక్కులా చెల్లాచెదురైపోయాము. నాలాంటి కొంతమంది ఉద్యమ జ్ఞాపకాలు చెరిపేసుకొని, ముఖాలకు కొత్త రంగులు వేసుకొని, ఎగ్జిక్యూటివ్‌లమై, టీచర్లమై, డాక్టర్లమై రకరకాల రొటీన్ జీవితపు కలుగుల్లోకి దూరిపోయాము. చుట్టూ సోకాల్డ్ భద్ర జీవనపు లక్ష్మణ రేఖను గీసుకుని నిర్భయాన్ని నటిస్తూ జీవిస్తున్నాము. నిజానికి భద్ర జీవనం అంటే పిరికివాడి స్వర్గం. అన్యాయం వైపు వేలు చూపించాలంటే భయం. ఉద్యమాలకు వెన్నుతట్టి సంఘీభావపు స్నేహ హస్తాన్ని ఇవ్వాలంటే భయం. ఖరీదైన ఇల్లు, భార్యాపిల్లలు, లగ్జరీలు, బద్ధకం ఇవన్నీ పోగొట్టుకుంటామేమోననే భయం. అందుకే గతాన్ని మరిచిపోయినట్టు నటిస్తూ ఏమ్నీషియా పేషంట్లలా జీవిస్తున్నాము.

నిద్ర లేచేసరికి ఉదయం తొమ్మిదయింది. ముఖంపై చురుకు చురుకుమంటూ సూర్యకిరణాలు. కళ్లు గుండుసూదులు గుచ్చే పిన్ కుషన్లలా ఉన్నాయి. ఇంట్లో అనూహ్యమైన సందడి వినిపిస్తోంది. పిల్లలు పరుగెత్తుతున్న సందడి. కిటికీలను, గోడలను సైతం చీల్చుకుని ప్రవహించగల కేరింతల చప్పుడు. కన్నీళ్లు, నిట్టూర్పుల మిశ్రమంతో రాత్రిలోకి నిష్క్రమించిన ఇంట్లో నవ్వులు కేరింతల ఉదయం రావటం ఆశ్చర్యకరంగా ఉంది.

"రాజూ! నిద్రలేచావా? ఇదుగో కాఫీ. తాగి స్నానం ఎట్సెట్రా కార్యక్రమాలు త్వరగా ముగించుకొని డైనింగ్ హాలులోకి రా! అన్నయ్యా, వదినా, పిల్లలు నీ కోసం ఎదురు చూస్తున్నారు."

"అన్నయ్యా ఆయనెవరు?"

"మా పెదనాయనగారి అబ్బాయి. ఎస్.పి.గా చేస్తున్నాడని చెప్పానుగదా! ఆయన వచ్చాడు కుటుంబంతో మీరు త్వరగా రండి."

స్నానం చేసి డైనింగ్ హాల్‌కు చేరేసరికి అక్కడ పెద్దపులిలా గంభీరంగా, క్రూరంగా ఉన్న రఘునాథరావు ఐ.పి.ఎస్., పక్కనే సెక్సీకరింపబడిన కరుణరసంలాంటి ఆయన భార్య, పాలకోవా అనో, జున్నుముక్క అనో పిలవాలనిపించే ఇద్దరు పిల్లలు కనిపించారు. 'హలో బావగారు!' 'నమస్తే అన్నయ్యగారు!' 'గుడ్‌మార్నింగ్ అంకుల్!' రసవత్తరమైన నాటకానికి నాంది వచనాల్లా ఉన్నాయి పలకరింపులు.

చాలాకాలంగా పరిచయమున్న స్నేహితుడిలా మాట్లాడుతున్నాడు రఘునాథరావు. ముఖానికి నవ్వు

పులుముకుని నాటకంలో పాత్రను పోషిస్తున్నట్టుగా. రొటీన్ కబుర్లు, కుశల ప్రశ్నలు అయినాక అసలు విషయంలోకి వచ్చాడు.

"అరుణ గురించి చెల్లాయి చెప్పింది. మా రికార్డుల్లో అరుణ, అరుణక్కగా తెలుసు. చాలా తెలివైన అమ్మాయి. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అనుకుంటాను. నీ సందేహం నిజమే. ఈమధ్యనే అరుణను మావాళ్లు అరెస్టు చేశారు. ఇద్దరు ముగ్గురు సీనియర్ ఆఫీసర్లు ఆ అమ్మాయికి వాస్తవాలన్నీ వివరించి చక్కటి హితబోధ చేశారు. ఈ వైల్డ్ డ్రీమ్స్ మాని మళ్లీ జన జీవితంలోకి రమ్మని రిక్వెస్టు చేశారు. చివరకు తనను ఉద్యమం లోంచి బయటకు రావడానికి ఒప్పించారు. ఆ అమ్మాయి తల్లిదండ్రుల్ని కూడా పిలిపించాము. సెల్ఫ్ ఎంప్లాయిమెంటు స్కీము కింద తనకు లోన్ ఇప్పించ డానికి కూడా ఏర్పాట్లు చేశాము. సో, నథింగ్ టు వర్రీ!"

రఘునాథరావు మాటలు పూర్తి అవకుండానే, "అమ్మయ్య! ఒక తుపాను ముగిసింది," అంటూ తన ఆనందాన్ని వ్యక్తం చేసింది లలిత. మరో గంట మాతో గడిపి సెలవు తీసుకున్నారు రఘునాథరావు అండ్ కో.

"సో, అరుణార్ణవపు సంచలనం నుంచి బయట పడ్డట్టేనా! బి ఛీర్‌ఫుల్ డియర్ కామ్రేడ్! ఫెయిరీ టేల్ లాంటి అరుణ జీవితం విషాదంగా ముగిసే అవకాశమే లేదు. ముఖంపైని దిగులు మబ్బుల్ని తుడిపేసుకొని చిరునవ్వుల వెన్నెలను వెలిగించు!" లలిత చాలా ఎగ్జైటెడ్‌గా ఉంది.

ట్రింగ్, ట్రింగ్... "ఫోన్ ఫర్ యూ డాడీ!"

"హలో! ఎవరు మాట్లాడేది?"

"బాబూ! నేను రామనాథాన్ని! అరుణ ఫాదర్ని. అరుణను వారంరోజుల క్రితం అరెస్టు చేశారు. ఇంత వరకు కోర్టులో ప్రొడ్యూస్ చెయ్యలేదు. ఎక్కడుందో తెలియటం లేదు. ఎవర్ని అడిగినా మాకు తెలియదు అంటున్నారు. మాకు ఎందుకో భయంగా ఉంది బాబూ! నీ పలుకుబడి ఉపయోగించి అరుణకు ఏం కాకుండా చూడు బాబు!"

"అలాగే సార్!" ఫోన్ క్రెడిల్ చేసేసరికి శరీరం చెమటలతో తడిసిపోయింది. మళ్లీ తెగిపోయిన అంగాల దగ్గర కలిగే బాధాకరమైన సెన్సేషన్.

ఇది ఎంతకీ ఆరని చితి. ముగింపులేని వ్యథ. అరుణ కాకపోతే మరో కమల, మరో రామారావు, మరో కామ్రేడ్, వాళ్లు నేను సైతం అంటూ అగ్నిగుండంలోకి దూకకా మానరు. బయటనున్న నేను విలవిలలాడకా మానను.

ఉద్యమంలో ఉన్న వాళ్లకు ఒకటే మరణం. బయట ఉన్నవాళ్లకు రోజూ మరణమే.

*ఆంధ్రజ్యోతి వారపత్రిక, 29 అక్టోబరు 1993*